క్లుప్తంగా

స్థితిగతులు మార్చుకోండి

చంద్రుగొండ: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని జీవన స్థితిగతులు మార్చుకోవాలని గొత్తికోయ ఆదివాసీలకు ఎస్సై మాచినేని రవి సూచించారు. మండలంలోని మద్దుకూరు గ్రామశివారు అటవీప్రాంతంలోని మంగళబోడును సోమవారం ఆయన సందర్శించారు. గొత్తికోయ ఆదివాసీలతో మాట్లాడుతూ.. పిల్లలను పాఠశాలల్లో చేర్పించి చదివించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

ములకలపల్లి: యువతరం అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి కొర్సా రామకృష్ణ పిలుపునిచ్చారు. పార్టీ మండల 8 మహాసభను సోమవారం ఓరుగంటి శ్రీను, ఈసం శివ, మిడియం నరేశ్‌ల అధ్యక్షతన సోమవారం ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం ప్రగతిశీల యువజన సంఘం మండల నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పద్దం లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా ఒగ్గెల వెంకటేశ్, కోశాధికారిగా మడివి సునిల్‌తోపాటు పలువురి సభ్యులతో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మణుగూరురూరల్: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్యాగాలకు, పోరాటాలకు నిదర్శనంగా నిలిచిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఈ నెల 17వ తేదీ వరకు జయప్రదం చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు మున్నా లక్ష్మీకుమారి, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, ఎస్‌కె.సర్వర్, వై.రాంగోపాల్, అక్కి నరసింహారావు, తోట రమేష్, కుటుంబరావు, ఎంపీటీసీ లక్ష్మయ్య, వీరస్వామి, రాజబాబు, కృష్ణ పాల్గొన్నారు.

రేషన్ దందా అరికట్టాలి

బూర్గంపాడు: రేషన్ బియ్యం అక్రమ దందాను అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రేషన్ డీలర్లే బియ్యం అక్రమదందాకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. రోజు ఎక్కడో దగ్గర రేషన్ బియ్యం పట్టుబడుతున్న ఈ దందా మాత్రం ఆగటం లేదని తెలిపారు. ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు పటిష్ట నిఘా పెట్టి నియంత్రించాలని కోరారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్ర నామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు స్వామి వారి పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కూలి పెంచండి

దుమ్ముగూడెం: పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రేగుబల్లి, దంతనం, నరసాపురం గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు దారుణంగా ఉన్నాయని, రేట్లు పెరిగేంతవరకు సమ్మె కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కం సావిత్రి, పుట్టి సావిత్రి, అమృతమ్మ,సుధారాణి, జెట్టి పద్మ, కాలవ పాపమ్మ, జెట్టి మనోరమ్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

భద్రాచలంఅర్బన్: నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం మండలాలలో డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల ప్రభావం రోజురోజుకూ పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా ప్రభావిత గ్రామాలకు మొబైల్ వైద్య బృందాలతో వైద్యం అందించాలని కోరారు.

విషజ్వరాల విజృంభణ

- మణుగూరులో ముంచుకొస్తున్న డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లు
- చిన్నారులపై అధిక ప్రభావం
- పూర్తిస్థాయి చర్యల్లో అధికారులు విఫలం


ప్రభుత్వాస్పత్రి వద్ద బారులుదీరిన ప్రజలు

మణుగూరురూరల్: మణుగూరు మండలంలో రోజురోజుకూ విషజ్వరాల విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నాయి. వీటి బారిన పడి పెద్దలు, చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియాలతో మణుగూరులోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఒక కుటుంబంలో ఎవరికైనా ఒకరికి విషజ్వరం వస్తే కొద్ది రోజులకే ఆ కుటుంబమంతా జ్వరాల బారిన పడుతున్న పరిస్థితి నెలకొంది. రక్తపరీక్షా కేంద్రాల వద్ద బాధితులు బారులు తీస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతూ వైద్యం పొందుతున్నారు. చిన్న పిల్లలకు జ్వరాలు వస్తే కుటుంబంలోని పెద్దలు ఆస్పత్రి వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

డెంగీ డేంజర్‌బెల్స్..

విషజ్వరాలలో ప్రధానంగా డెంగీ మండలంలో అధికంగా కనిపిస్తోంది. కొన్ని కేసులు బహిర్గతం అవుతుండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ లెక్కకు చిక్కని బాధితులు అనేకమని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం గుట్టమల్లారం గ్రామంలో డెంగీ బారిన పడి ఓ చిన్నారి, మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లో ప్రజలు అలర్ట్ అవడంతోపాటు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణమే కారణమా?

పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్లే మణుగూరులో జ్వరాల వ్యాప్తి తొందరగా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా, మండల అధికారులు పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో విఫలమయ్యారని చెబుతున్నారు. చెత్తను తీసివేసి బ్లీచింగ్ చేస్తే కొంతవరకు జ్వరాలను, అంటువ్యాధులను అరికట్టవచ్చు. కానీ మణుగూరు మున్సిపాలిటీ అధికారులు, పంచాయతీల అధికారులు ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం, మురుగుకాలువల్లో వ్యాప్తి చెందుతున్న దోమలు, కీటకాలను నిర్మూలించడంలో ఆశించిన చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులు మణుగూరులో రోజురోజుకూ ఎక్కువవుతున్న విషజ్వరాల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మణుగూరులో పెరుగుతున్న విషజ్వరాలను అరికట్టాలి. అందుకు అనుగుణంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలి. సైడ్ డ్రైయిన్లను శుభ్రం చేయాలి. మురికి కాలువలు, గుంటలలో ఆయిల్ బాల్స్ వేసి దోమలను నివారించాలి. ఈ విషయాల్లో జిల్లా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– ఉసికెల కొండయ్య, ఉడతానేనిగుంపు

దోమలను నిర్మూలించాలి



మణుగూరు పట్టణంలో విషజ్వరాలు విపరీతంగా పెరిగిపోయాయి.పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయి. దీనివల్ల జ్వరాలు ఊహించినదానికన్నా త్వరగా వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రపరచాలి. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– మునిగెల హరిబాబు, కమలాపురం

ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



మణుగూరు మండలంలోని విషజ్వరాలు విస్తృతంగా వ్యాప్తి చెందుతుండడం వల్ల బాధితులు ఆర్ఎంపీలను సంప్రదించవద్దు. పరిస్థితి విషమించక ముందే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలి. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలకు సంబంధించి మందులు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ రాంప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్

సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం


వ్యవసాయ పరికరాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: వ్యవసాయ రంగంలో వినియోగించే యంత్రాలు, పరికరాలు అద్దె ప్రతిపాదికన లభించడం వల్ల చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదర్శ మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ యంత్రాలు, పరికరాల కేంద్రాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వెలుగు సమాఖ్య ద్వారా మహిళ సభ్యులకు అందజేసిన పిండిమిల్లు యూనిట్లనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రాల ద్వారా లక్షల విలువ చేసే వ్యవసాయ యంత్రాలు, పరికరాలు మహిళ సమాఖ్య ద్వారా తక్కువ రేట్లకే అద్దెకు ఇస్తారని తెలిపారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీటీసీలు దేవరపల్లి అజయ్‌కుమార్, బుడే, వెలుగు సిబ్బంది నాగేశ్వరరావు, గోళ్ల వెంకటేశ్వరరావు, శ్రీను, చింతయ్య, భాను పాల్గొన్నారు.

అటవీ అమరుల దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న అటవీ అధికారులు, సిబ్బంది

దమ్మపేట: మండల కేంద్రంలో అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయం నుంచి మందలపల్లి వరకు ఫారెస్టు అధికారులు, సిబ్బంది మోటారు బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మందలపల్లిలో అమర వీరులకు కాసేపు మౌనం పాటించి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ కరుణాకరచారి, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, సెక్షన్ ఆఫీసర్లు సత్యం, సతీష్, మదనయ్య, బీట్ ఆఫీసర్ మారేష్, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

మణుగూరురూరల్: మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గడప గడపకు కాంగ్రెస్ పాదయాత్రను నిర్వహించారు. పాదయాత్రలో పార్టీ డిక్లరేషన్లను ప్రజలకు వివరిస్తూ కరపత్రాల ప్రచారం పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ గృహాలకు రూ.5లక్షల సాయం, రూ.2లక్షల రైతు రుణమాఫీ, రూ.5వేల పెన్షన్ వంటి పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వెంకట్రావు గౌడ్, కనకయ్య, బాజీ, తరుణ్‌రెడ్డి, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, పాల్వంచ రాములు, శ్రీనివాస్‌రావు, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి


తహసీల్ ఎదుట నిరసనలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

ములకలపల్లి: గృహలక్ష్మి, బీసీ, దళితబంధు వంటి ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికార పార్టీవారికే పథకాలను ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రకటించిన పథకాలు, అధికారపార్టీ నేతల అనుచరులకు, బడాబాబులకు దక్కుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తిమ్మంపేట సర్పంచ్ గౌరి లక్ష్మి, నాయకులు ఊకంటి రవికుమార్, ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, రావూజా, దేవేందర్, సామిని, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో..

చర్ల: మండలంలో అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చర్లలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రంగు రమేష్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకాన్ని ఏజెన్సీలో కేవలం షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు మాత్రమే ఇస్తూ.. మిగిలిన కులాల్లోని పేదలను విస్మరించడం సరైంది కాదని ఆయన అన్నారు. పథకాలన్నీ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు వరాలుగా మారాయని విమర్శించారు. కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వీరమల్ల ఉమ, డివిజన్ నాయకులు వైఎస్ రెడ్డి, బర్ల రామకృష్ణ, నరేష్, గౌస్, అరుణ, హుస్సేన్‌బీ, వెంకటనర్సు, లక్ష్మి, ఆసీఫా, సయ్యద్ అమీనా, సయ్యద్, జరీనా తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎఫ్ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా శ్రీనివాసాచారి

అశ్వాపురం: ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్(ఐఏఎఫ్) ఉమ్మడి రాష్ట్ర చైర్‌పర్సన్‌గా అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన పదిరావూరి శ్రీనివాసాచారి నియమితులయ్యారు. తిరుపతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఇదే వేదికపై శ్రీనివాసాచారికి ఇంటర్నేషనల్ జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డును టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తితో పాటు ఫెడరేషన్ బాధ్యులు అందజేసి సన్మానించారు.

పాస్ పుస్తకాలు అందజేయాలి

దుమ్ముగూడెం: పెండింగ్‌లో ఉన్న సాగు భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లూరు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు చేయకుండా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సోందె నాగేశ్వరరావు, కోరం మురళి, కోర్స రామచంద్రయ్య, మర్మం వెంకటేశ్వరరావు, పొడియం సీతయ్య, కల్లూరి వరలక్ష్మి, పూనెం సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అధ్యక్షుడికి సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ఉన్న కనక దుర్గ దేవి ఆలయ అధ్యక్షుడు రామకృష్ణను సోమవారం ఆలయ ప్రాంగణంలో గోళ్ల భూపతిరావు సన్మానించారు. నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తూ సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని పేర్కొన్నారు. పూజారి శివకోటి విశ్వనాథం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం వడ్డెరల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తురక లక్ష్మయ్య కోరారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చల్లా వెంకట్రావు, సెక్రటరీగా బత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఉప్పతల రాము, మండల యూత్ కమిటీ అధ్యక్షుడు బత్తుల విజయ్‌రాంను ఎన్నుకున్నారు.

ఏఐటీయూసీ నాయకుడి మృతి

భద్రాచలంఅర్బన్: సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ నాయకుడు బల్లా సాయికుమార్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గడచిన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సాయికుమార్ భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: మణుగూరు మండలంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గుట్టమల్లారం గ్రామంలో సుమారు రూ.50లక్షల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, లంక మల్లారంలో గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించనున్న కమ్మ సంఘం కమ్యూనిటీహాల్ పనులకు విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధులు శంకుస్థాపన చేశారు. అలాగే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–2 పంచాయతీరాజ్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్ డీఈ సైదులురెడ్డి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు, జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం


తహసీల్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారు అని సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు అన్నారు. సోమవారం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ.. సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ ముజాహిద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడారు. పార్టీ నాయకులు దస్తగిరి, ధర్మ, శివక్రిష్ణ, బెజవాడ రాంబాబు, జాన్‌బీ, నాగమణి పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన సీఐ


పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

భద్రచలంఅర్బన్: వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రాచలం పట్టణ కేంద్రంలోని గోదావరి నదీ తీరాన వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కూడా నిమజ్జనానికి భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆ ప్రదేశంలో పార్కింగ్‌కు ఏర్పాటు చేసిన స్థలాన్ని సోమవారం సీఐ నాగరాజు పరిశీలించారు. ఆయన వెంట ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు తదితరులున్నారు.

ముమ్మరంగా వైద్యశిబిరాలు


దుమ్ముగూడెం: చిన్నారులను పరిశీలిస్తున్న డాక్టర్ రాజేష్

మణుగూరురూరల్: మండల పరిధిలోని వాగుమల్లారం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ అనూష గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువురు జ్వరపీడితుల రక్తనమూనాలను సేకరించి జాగ్రత్తలు సూచించారు. అనంతరం నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీలార్వా చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది అనసూర్య, శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాల, కేజీబీవీ విద్యాలయంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. విద్యార్థులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ నాగేశ్వరరావు, నాగజ్యోతి, విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోమియోపతి వైద్య శిబిరం..

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి జీపీఎంఎస్ పాఠశాలలో పర్ణశాల హోమియోపతి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 70 మంది చిన్నారులను పరిశీలించి వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ మెహబూబ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్‌బీసీ రోడ్‌లోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం విజయవంతమైనట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్స్ విజన్ ఐ ఆస్పత్రి వైద్యులు అశోక్, మహేందర్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కంటి శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెబాట


పినపాక: మండల పరిషత్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలో అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, గ్రాట్యుటీ చట్టం అమలు, షరతులు లేకుండా మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించడం, హెల్పర్లను నియమించడం వంటి డిమాండ్లతో అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి నెరవేర్చాలని ఈ సందర్భంగా సంఘాల నాయకులు కోరారు. లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం, సీపీఐ నాయకులు దీక్షలకు మద్దతునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: సమ్మె శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు


చర్ల: సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో నినాదాలు చేస్తున్న బ్రహ్మచారి


భద్రాచలంఅర్బన్: అంబేద్కర్ సెంటర్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


దమ్మపేట: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు